# కథ కాదు

అఫీసు నుండి రాగానే ఇంట్లో అందరి మొహాలూ భయకంపితాలయి వున్నట్లున్నాయి. జరగకూడనిదేదో అయినట్టు!

"ఏమలా వున్నారని" అడగడానికి తగిన కారణం నాకు కన బడలేదు.

మెకానికల్‌గా నాకు కాఫీ, టిఫిన్‌ఇచ్చి వెళ్ళిపోయింది మా ఆవిడ— "అంతగా ఏమయినా అయితే నాతో చెప్పదా?" అని అనుకుని అడగ లేదు!

ఇంతలో బడినుండి మా పాప గల్లగల్లాడుతూ వచ్చింది. అది వస్తూందంటే అల్లంత దూరంనుండే తెలిసిపోతుంది ... కాని ... ఇంటి వరకు తిన్నగా వచ్చినా, ఇంట్లోకి మాత్రం రాదు. తలుపు గొళ్ళెం చప్పుడు చేస్తుంది! ఎవరా అని చూస్తే ఎక్కడా కనిపించదు...ఎక్కడో దాక్కుంటుంది— ఇంత ఇంట్లో నేనున్నానని తెలిస్తే చాలు — కిటికీ లోంచి నా మీద రాళ్ళు విసురుతుంది. చూస్తే కనిపించదు. తలుపు తీసే సరికి ఏవారో దాగుని గట్టిగా అరిచి భయపెడుతుంది. లేకపోతే గోడ ప్రక్కో పక్కింట్లోనో దాగున్న పాపని వెతికి, ఎత్తుకుని తీసుకురావాలి!

అలాటిది— గబగబా ఇంట్లోకి వచ్చేసి—

నాన్నారూ నాన్నారూ, మరమన పిల్లేమో" అంటూ గుక్క తిప్పుకో కుండా... చెప్పడం మొదలెట్టింది.

"మన పిల్లి ఏమిటమ్మా? మనం పెంచలేదే" అన్నా ఆశ్చర్యంగా.

"అదే నాన్నా... మన అటకమీద మొన్న పిల్లల్ని పెట్టలేదూ? ఆ పిల్లి..." అని గుర్తుచేసింది.

నిజమే మా అటకమీద పిల్లి పిల్లల్ని పెట్టింది మేం భోజనాలు చేస్తున్నప్పుడు కుంయ్ కుంయ్ మంటున్నాయి.

"అవునమ్మా ఏమిటయింది... తీసుకువెళ్ళిపోయిందా!" అని అడిగేను అందుకే అంతలా చెబుతుందేమో అని.

"అదికాదు నాన్నా... పాపం దానిపిల్లల్ని తినేసింది..."

—అంతేనా నా కేమీ ఆశ్చర్యం అనిపించలేదు. ఏమంటే పిల్లులు పిల్లల్ని పెట్టాక కళ్ళు కనబడవని, అప్పుడా పిల్లల్ని నొక్కి చంపేస్తూ వుంటాయని విన్నాను కాబట్టి.

"వెధవ పిల్లి పోనీలే అమ్మా?" అన్నాను సుళువుగా.

"కాదు నాన్నా... ఎంతభయం వేసిందని! అమ్మబాబో, అమ్మా, నాయనమ్మా, అన్నయ్యాలూ అందరం భయపడిపోయాం?" అని ఇంతింత కళ్ళు చేసుకుని ఆ భయం అంతా చూపెడుతూ చెప్పింది.

"పిల్లల్ని చంపేస్తుందిగాని తినదమ్మా!" అన్నాను మళ్ళీ.

"లేదు నాన్నా తినేసింది ... పాపం ... మనపిల్లి ఎంత ఏడిచిందో!"

"మరి తినేసిందేమో ఇంక ఏడవడం ఏమిటమ్మా!" అన్నాను బోధపడక— ఇంతలో పాపకి బట్టలు మార్చడానికి వచ్చింది మా ఆవిడ.

"ఏమిటంటూంది పాప... పిల్లి పిల్లల్ని చంపేస్తుందిగాని తినేసిందా?" అని అదేదో తెలుసుకుందామని అడిగేను.

మా ఆవిడ నిట్టూర్చింది—

"అబ్బ ఆ వూసు మళ్ళీ వచ్చిందా... తలచుగుంటే గుండె జారిపోతూంది" అని అంతకన్నా వింతగా అంది.

పిల్లిట. పిల్లల్ని పెట్టి చంపేసింది... ఈ మాత్రం స్వల్ప విషయం ఇంత దీనిగా ఎందుకు తీసుకుంటున్నారో నా కేమీ అర్థంకాలేదు—

అసలింతకీ ఏం జరిగిందిట!—

అడ్డమయిన చెత్తకూ ఆశ్రయం అటక అని అందరికీ తెలిసిందే— అలాటి అటక మా ఇంట్లోనూ వుంది! పనికిరాని వస్తువులను అవతల పారేయండి అని మనం చెబితే— పారేయడం ఎందుకు! అటకమీద పడేస్తే ఎప్పుడే అవసరం పడుతుందో!" అని దానిమీద గిరాటువేసే మనస్తత్వం వాళ్ళది— అంచేతే అటక ఎక్కిన వాళ్ళకి తరుచూ గొలుసుల బొమ్మ పడిస్తూ వుంటుంది.

ఇంట్లో మనం కాపురం వుంటే పాపం మనని ఆశ్రయించుకు బ్రతికే ఎలుకలూ, తేళ్ళూ, బొద్దింకలూ, చీమలూ, పురుగులూ, అటక మీద నివాసం చేస్తూ వుంటాయి.

ఏనాటి నుండో— "ఏకించి పరుపు కుట్టించాలి" అని అనుకుంటూ ఒక కర్రపెట్టెలో పడేసిన పాత దూది పరుపు ఈ నాటికి ఉపయోగానికి వచ్చింది— ఎలాగంటే.

ఆ వీధిలో పిల్లితల్లి నీళ్ళోసుకోవడం, మా ఇల్లే పుట్టినిల్లు గాబోలు వెతుక్కుంటూ పురిటికి రావడం, ఈమె తల్లి అటక గది దొరకటం జరిగింది.

"పిల్లి పిల్లలు పెడితే ఆ ఇంటికి మంచిదట" మా అమ్మ అలాగని చెప్పింది పోనీ మనకేం పోయిందిలే, పిల్లీ, పిల్లలూ ఇంట్లో ఆడుకుంటూ వుంటాయి అని అనుకున్నాం.

ఆ మర్నాడే మేం భోజనాలు చేస్తూవుంటే, కుంయ్, కుంయ్‌మని అరుపులు వినిపించేసరికి మేం అందరం, ఇంట్లో ఆడపడుచుకు సుఖ ప్రసవం అయినట్లే సంతోషించాం.

ఆ తల్లిపిల్లి రెండు రోజులవరకూ పిల్లల్ని విడిచిపెట్టలేదు. మూడోనాడు మాత్రం ఒకసారి దిగి— మా అమ్మ చల్లచేస్తూ, వంటసంద డిలో వదిలిపెట్టి వెళ్ళిన వెన్నముద్ద గిన్నెతో తినేసి చక్కాబోయింది. ఇలా ఎప్పుడో ఓ అయిదు నిముషాల క్రిందికి దిగి ఇట్టే పిల్లల దగ్గరకి వచ్చేస్తూ వుండేది.

"పిల్లి పిల్లల్ని చూస్తానంటూ" పాప ఒకటేగోల! ఆఖరికి పిల్లినిలే సమయంచూసి రెండోవాడూ, పాప అటకఎక్కి చూశారు. మూడుపిల్లల్ని పెట్టింది. ఎంచక్కా మచ్చలపిల్లి ఒకటి. తెల్లటి పిల్లిపిల్లలు రెండూ, వాళ్ళింకా చూస్తున్నారో లేదో పెద్దపిల్లివచ్చి గుడ్లింతచేసి గుర్‌మనడం ప్రారంభించింది.

ఛలపడి ఇద్దరూ దిగిపోయారు.

మళ్ళీ మర్నాటివరకూ పెద్దపిల్లి, పిల్లల్ని వదిలిపెట్టి వెళ్ళలేదు ఆ మర్నాడు మళ్ళీ దిగింది. ఇంట్లోకూడా తినడానికి చిక్కకపోతే అలా బయటికివెళ్ళింది కాబోలు.

ఆ సమయం కనిపెట్టి——

గండుపిల్లి ఒకటివచ్చి అటకచుట్టూ ఒకసారి తిరిగి అటకమీదకి ఒక్కుమ్మడి ఎగిరింది.

పెట్టిలో పిల్లల్ని పసిగట్టి అందులో దిగింది.

ఇంకా కళ్ళువిడని ఆ పసిపిల్లలు తల్లే అనుకున్నాయి.

"మ్యావ్ మ్యావ్"మంటూ ఆ గండుపిల్లిని చుట్టేసి మీదకు పాకడం మొదలెట్టేయి. గండుపిల్లి తటపటాయిస్తుంది.

ఇంతలో ఆ అరుపులెక్కడ విన్నదో తల్లి పిల్లి గాలిలో ఎగురుతుంటూ వచ్చి అటకమీదకు పెట్టెదగ్గరికి ఒకేగెంతు ఎగిరింది. పెట్టెలో గండుపిల్లిని చూసి గతుక్కుమని ఇవతలే నిలబడి పోయింది.

గండుపిల్లి గుర్‌మంది.

గండుపిల్లిని చూసి తల్లిపిల్లి తోకని సీసాకడిగే బ్రష్‌లా చేసి గుండెలదిరేలా అరిచింది. కాని గండు అంతకన్నా గట్టిగా గాండ్రించింది ఆ అరుపులకు అటక అదిరిపోయింది.

తల్లి పిల్లి పెట్టె యివతలినుండి కలియబడింది. మగపిల్లి పెట్టెలో నుండి తల్లిపిల్లిని లోపలకు రానివ్వకుండా పంజాతో కొడుతూ అరుస్తోంది.

ఎలాగయితేనేం తల్లిపిల్లి పెట్టెలో జొరబడి పిల్లలదగ్గరికి వెళ్ళ బోయింది. గండుపిల్లి దానిమీదపడి రక్కి పారేసింది. ఒక కాలు రక్తం వచ్చేటట్టు కరిచేసింది. పిల్లితల్లికి ఒళ్ళంతా రక్తమయం అయింది. కుంటుకుంటూనే ఒకే పట్టుదలతో తలబడ్డది. కాని ఆ మగపిల్లి వళ్ళంతా కరిచేస్తూ అవతలకి నెట్టేసింది. రెండూ ఆ అటకమీద స్వైరవిహారం చేశాయి. సామాన్లన్నీ మీద పడిపోతున్నా లెక్కచేయలేదు.

ఈ గోలకు ఇంట్లో మా అమ్మా, మా ఆవిడ పాప అక్కడకు వచ్చారు.

ఆ లోపున తల్లిపిల్లిని అటకమీదనుంచి క్రిందకు తరిమివేసింది గండుపిల్లి. పెట్టెలో జొరబడింది.

తల్లిపిల్లి చేసేదిలేక కుంటుకుంటూ రక్తం కారుతున్నా మా అమ్మ చుట్టూ, గొంతు చించుకొని అరుస్తూంది అటకచుట్టూ తిరుగుతూంది.

అటకమీద గండుపిల్లి చిన్నపిల్లుల్ని చంపేస్తూంది. సందేహం లేదు. అదిచేసే చప్పుళ్ళూ పిల్లిపిల్లల అరుపులూ అలావున్నాయి. మహా భయంకరంగా క్రిందపిల్లి తల్లి నిస్సహాయంగా ఏడుస్తూ అరుస్తూ అటక మీదకు చూస్తూ వుంది.

ఇంక సహించలేక మా అమ్మ తెగించి నిచ్చెన వేసుకుని కర్ర తీసుకు వెళ్ళింది. కాని ఆ పెట్టెలో గండుపిల్లిని ఆ బీభత్సాన్ని చూసే సరికి తల తిరిగినంత పని అయింది. ఆ పిల్లి తలఎత్తి 'పీక కొరికేస్తా' అన్నట్లు గుడ్లుపెట్టి గాండ్రించేసరికి మా అమ్మ భయపడిపోయి దిగిపో యింది. మరెవరికి దానిని పారదోలే సాహసం లేకపోయింది.

క్రిందచూస్తే పాపం తల్లిపిల్లి అవస్థ చూసేసరికి అందరికీ గుం డెలు చెరువులయినాయి.

అది అరుస్తూ ఉచ్చ పోసుకోవడమే కాకుండా విరోచనం కూడా చేసుకుంది. జాలిగా వాళ్ళవేపు చూసి లేనిశక్తి తెచ్చుకుని అటకచుట్టూ తిరగటం మొదలుపెట్టింది.

అటకమీద అప్పటికప్పుడే మూడు చిన్నపిల్లుల అరుపుల్లోని రెండు గొంతుకలు ఆగిపోయినాయి. ఒక్క పిల్లమాత్రం అరుస్తున్నట్టు వినిపించింది.

క్రింద పిల్లితల్లి అటూ యిటూ చూసింది. ఎవరూ తనకు సహాయం లేకనుకుంది కాబోలు, మరి సహించి ఊరుకోలేకపోయింది... లేని శక్తి తెచ్చుకొని, ఆవేశంతో, ఉద్రేకంతో, కోపంతో మళ్ళీ అటకమీదకు ఎగిరింది. ముందూ వెనకా చూడకుండా ప్రాణానికి తెగించి ఆ మొగపిల్లి మీద పడింది చీల్చి చెండాడి వదిలింది.

అకస్మాత్తుగా మీదపడిందేమో మారణకాండలో వున్న మగపిల్లి తట్టుకోలేకపోయింది. కంటివెంట నెత్తురు కారుతూవుంటే నోటితో పిల్లిపిల్లని కరచుకొని క్రిందకి గెంతేసింది. గెంతడంలో పట్టుతప్పి పిల్లిపిల్ల క్రింద పడిపోయింది. క్రింద మావాళ్ళు చూస్తూవుండడం చూసి భయపడి పారిపోయింది.

క్రిందపడిన పిల్లిపిల్ల అప్పటికప్పుడే ప్రాణం వదిలింది.

తల్లిపిల్లి పెట్టెలోకివెళ్ళి ఆతృతగా పిల్లలకోసం వెతుక్కుంది. కాని చిన్ని పిల్లిపిల్ల అరుపులే వినబడలేదు. అంతా నిశ్శబ్దం. ఘోరమైన భయంకరమయిన నిశ్శబ్దం ఆవరించింది.

మళ్ళీ ఒక్కసారి అటక దద్దరిల్లిపోయేట్టు ఆ పిల్లితల్లి అరవడం మొదలెట్టింది. కనిపించని పిల్లలుకోసం అటకంతా అరుస్తూ గాలించింది— కాని ఏవీ? కాళ్ళల్లో పడి పొదుగుకోసం ప్రాకులాడే పిల్లి పాపలు ఏవీ? ఆ గండుపిల్లి కడుపులో వేసుకుపోయిందని దానికి తెలియదా?

అరచి అరచి క్రిందకు దిగి చచ్చిపోయిన పిల్లనుచూసి నాకడం మొదలెట్టింది. కాని ఆ పిల్లిపిల్ల లేచి తోక ఎత్తుకొని పాలకోసం వస్తేగా? కర్రగట్టుకు పోయింది.

ఆ దృశ్యం చూడలేక మావాళ్ళు కళ్ళంట నీళ్ళు పెట్టుకున్నారు. అక్కడినుండి వచ్చేశారు.

'పాప' బిక్క చచ్చిపోయింది. ఆ రాక్షసత్వం కాదు మృగత్వం చూడలేక అమ్మ ఒళ్లో హత్తుకుపోయింది, మా అమ్మ, మా ఆవిడ అందరూ హడలిపోయినారు.

కొంతసేపు నాకి నాకి హృదయ విదారకంగా అరుస్తూ చచ్చిపోయిన ఆ పిల్లని నోట కరచుకుని ఎటో వెళ్ళిపోయింది ఆ తల్లిపిల్లి—

ఇంత హత్య జరుగుతున్నా ఎవరూ ఆపలేకపోయినారు. ఇంట్లో మనుషులు అయినా ఇలా జరగవలసిందేనా? ఏమో? ఆరోజున అదృశ్యం చూశాక ఇంట్లో ఎవరూ భోజనాలు చేయలేదు.

ఇది విన్నాక నాకూ ఆశ్చర్యమనిపించింది.

* * * *

మా ఇంటి ప్రక్కనే ఒక కుటుంబం వున్నది. ఆ ఇంటి యజమానికి త్రాగడం అలవాటు వున్నా ఆయన స్వభావం మాత్రం చిత్రమయింది.

ఇంటికి రాగానే అతని అరుపులతోనూ, కేకలతోనూ, ఇల్లంతా పెద్ద గందరగోళంలా వుంటుంది. ఇంటి పెంకులెగిరి పోతుంటాయి. మధ్య మధ్య చిన్న చిన్న గొంతుకలు వినిపించినా ఇతని గొంతుకే పైకి వినిపిస్తుంది. ఇతను వున్నంతసేపూ ఇల్లు వణికిపోతూ వుంటుంది.

అతను తన "పురుషాహంకారాన్ని" చూవుదామనుకుంటాడో ఏమో అతనికి ఎవరూ ఎదురు చెప్పడానికి మాత్రం వీల్లేదు. ఏమయినా అంటే 'తెచ్చి పోషిస్తున్నాను నా ఇష్టం" అంటాడు.

"ఇప్పుడు చెడ్డయిపోతే తరువాత పిల్లలు తమంతటి వాళ్ళయేక అభిమానం వుండదు అప్పుడు అనుభవిస్తావు" అని ఎవరయినా అంటే...

"అప్పటిమాట చూసుకుందాం. ఇప్పుడు నా మాట చెల్లవలసిందే" అని అంటాడు ఇంక ఎవరు చెప్పగలరు. అతడేం చేసినా అడగడానికి లేదు.

అతనిమీద ఆధారపడ్డవాళ్ళు కాబట్టి ముగ్గురు పిల్లలూ, భార్యా, తల్లీదండ్రీ, అక్కాచెల్లెలూ అందరూ అతని ప్రవర్తనకి లోలోన ఎంత బాధపడినా పైకి ఏమీఅనలేక చచ్చినట్లు పడివుండవలసిందే...

అతనికి కోపంవస్తే ఇంట్లో విచక్షణ లేకుండా అందర్నీ రేవు పెడుతూవుంటాడు. లోలోపల ఏడుస్తూ ఊరుకోవలసిందేగాని, పైకి చెప్ప కుండికి కూడాలేదు.

ఒకనాడు సాయంత్రం, ఆ ఇంట్లో ఏడుపులూ, మొర్రలూ వినబడుతున్నాయి. మాకది అలవాటే కాబట్టి ఊరుకున్నా, మనసుమాత్రం పీడిస్తూనేవుంటుంది. ఏమయిపోతుందోకోపంతోఅతనేం చేస్తున్నాడోఅన్న ఆరాటం! వెళ్ళి ఆ సమయంలో ఏమన్నా అన్నామా అటుంచి అటు మన మీదకు ఏమంటాడో అన్న భయం.

ఆ తర్వాత తెలిసిన విషయం ఏమంటే...

అతగాడు ఇంటికిరాగానే, రెండోకొడుకుని పట్టుకుని, చావకొట్టడం మొదలెట్టేడు...ఎందుకంటే "తమ్ముడు సైకిలు పట్టుకెళ్ళి విరగ్గొట్టి తెచ్చేడ"ని పెద్దవాడి రిపోర్టు.

వెనక ముందూ చూడకుండా, సైకిలు ఏమయిందోకూడా చూడకుండా పసివాడిని పట్టుగొని తన చేతులు నొప్పెట్టేవరకూ చేత్తోనూ ఆ తర్వాత దేనికి ఏది దొరికితేదానితోనూ కొట్టడం ప్రారంభించేసరికి మిగ పిల్లలు భయపడి ఇంట్లోంచి పారిపోయారు. తండ్రీ తల్లి "నాయనా కొట్టకురా! పసివాడు చచ్చిపోతాడు. వెధవసైకిలు పోతేపోయిందిలే ఊరుకోవాడిని కొట్టకు!" అని అడ్డుకున్నా ఊరుకోలేదు.

"వెధవ చస్తే చావనీ సైకిలు ముట్టుకోవద్దని ఎన్నిసార్లు చెప్పినా ఎందుకు తీశాడు. ఇవాళ ఏదోఒకటి తేల్చేస్తాను. ఆ మొండితనం—వదల కొడతాను!" అని అంటూ ఇంకా రెచ్చిపోయాడు.

నాన్న కొడుతూవుంటే ఎదిరించే ధైర్యం, శక్తికూడా లేక ఆ చిన్నవాడు ఉండలా చుట్టుకుపోయి మీదపడుతున్న పిడుగులాటి దెబ్బలకి తట్టుకుంటూ ఏడుపు దిగమింగుతున్నాడు.

అంతవరకూ చూస్తూవూరుకున్న అతని ఇల్లాలు ఇంక సహించ లేకపోయింది. పిల్లవాడి పరిస్థితి ఇంకో నిముషం ఆగితే ఏమౌతుందో అన్నట్టుంది. మరి పట్టలేక భర్తకి అడ్డంగా వెళ్ళింది.

"నన్ను కొట్టండి...వాడినేం అనకండి నేనేతీయమన్నాను సైకిలు- వాడిని కొట్టకండి"

"నువ్వూరుకో—నేను కొడుతున్నప్పుడు అడ్డురావద్దని. నీకు ఎన్ని సార్లు చెప్పేను...నేను వద్దంటే ఎందుకు తియ్యాలి. ఇవాళ వీడిని చంపే స్తాను...పో అవతలకి." అని అవిడను ఒక్కతోపు తోసి మళ్ళీ కొడుకు మీద పడ్డాడు. అదిచూసి ఆమె గుండెలుబాదుకుంటూ భర్తకి కొడుక్కీ మధ్య అడ్డంగా పడిపోయింది.

ఆ కోపంతో, ఆమె జుత్తుపట్టుకొని ఈడ్చి నాలుగుతన్ని అవతలకు తోసివేయడంలో ఆమె తల గోడను కొట్టుగోని...అక్కడే కూలబడి పోయింది. మరి ఎదిరించే ధైర్యం, శక్తి లేక భయంతో అలాగే, అతనేం చేస్తున్నా చూస్తూ కూర్చుండిపోయింది.

తల్లి, తండ్రీకూడా ఏమనడానికి భయపడి అసహాయంగా నిలబడి వుండిపోయారు.

అతని కాళ్ళ దగ్గర ఫుట్‌బాల్ అయాడు ఆ కుర్రవాడు— కాళ్ళతో తన్నేడు కుమ్మేశాడు.

అయినా అంత మందీ ఆ ఒక్కడు చేస్తున్న రాక్షసత్వాన్ని ఎదిరించలేకపోయారు. మళ్ళీ అతను కొట్టడానికి చెయ్యి ఎత్తబోయే సరికి—

ఆ చిన్నవాడు ఏడుపుకూడా మాని బ్రేళ్ళాడిపోయినట్లు చలనం లేకుండా పడి వుండిపోయాడు.

ఆ రాక్షసుడికి అప్పుడు కళ్ళువిడ్డాయి. చైతన్యం వచ్చింది. ఈ ప్రపంచంలో పడ్డాడు. లేకపోతే ఏమయి వుండేదో...కొడుకు అలా అయిపోవడం చూసి ఏమనుకున్నాడో ఏమో...

మరి కొట్టడం మాని—వెనక్కు తిరిగి—

"చంపులాను. ఏదవని, మీరెవరు అడగడానికి. నా ఇష్టం!" అని గొణుక్కుంటూ ఇంట్లోంచి అలాగే బయటికి వెళ్ళిపోయాడు.

అతను వెళ్ళిపోగానే, ఆ ఇంట్లో వృద్ధదంపతులూ, ఆ తల్లీఏడుస్తూ ఒణికిపోతూ పిల్లాడి దగ్గరికి వెళ్ళి వాడి స్థితిచూసి గొల్లున ఏడవడం మొదలెట్టేరు.

ఇంక ఉండబట్టలేక పరుగెట్టి వెళ్ళాం-అప్పటికి, ఆ పిల్లాడి చుట్టూ మూగి ఏడుస్తున్నారు. అందర్నీ లేపి వెళ్ళి చూసేసరికి పిల్లాడు కదులుతున్నాడు! దెబ్బలికి సొమ్మసిల్లిపోయాడని చెప్పి, చల్లటి నీళ్ళు జల్లి ఉపచారాలు చేసే సరికి, వెక్కుతూ, భయపడుతూ, ఆ పిల్లాడు లేచాడు.

ఆ ఇంట్లో వాళ్ళందరూ సిగ్గుతో, వచ్చిన వాళ్ళ మొహాలు చూడలేక జవాబు చెప్పలేక ముడుచుకుపోయి తలలువంచుకున్నారు.

* * * *

ఈ రెండు సంఘటనలూ తలుచుకుంటే భేదం లేదనిపిస్తూంది. జంతువులేకాదు. మనుషులేకాదు. ఈ సృష్టిలోనే పురుషజాతి, అహంకారం, అధిక్యత, వీటి ప్రభావం ఎక్కువ అనిపిస్తుంది. స్త్రీ శక్తి స్వరూపిణి!...కాని, తనను రక్షించుకోడంలోనేగాని, ఏ ప్రభావానికిలోనై చేతకానిదయి వుండిపోతుంది? ఎంత ఆలోచించినా జవాబు దొరకదు.

ఆంధ్రజ్యోతి వార పత్రిక 9-1-70